# మారిన మనసు

మూలం :

శ్రీ విశ్వంభరనాథశర్మ. — 'కౌశిక్'

అనుసరణ :

శ్రీమతి గోపరాజు సత్యవతి.

"పెద్దబ్బా! నాకు రైలు బన్ని తెత్తి పెత్తవూ?" అంటూ ఐదేళ్ళబ్బాయి రామదాసు వైపుకి పరుగెత్తు కొచ్చాడు.

"ఆఁ! అల్లాగే బాబూ. తప్పకుండా నీకు రైలుబండి తెస్తా"నంటూ ఆయన ఆ అబ్బాయిని చేతులు చాచి తన కౌగిట్లోకి తీసుకొన్నాడు.

"రైలెక్కి యెక్కడికి పోతావు?" అంటూ అనం గానే అబ్బాయి "రైలెక్కి యెక్కడికో దూరం— యేదో వూరెళ్లి పోతాం" అని సమాధాన మిచ్చాడు.

"రైలుబన్ని తెస్తుంటే నాన్నెప్పుడూ తేడు— నాన్నని రైలెక్కించను. యింకెవ్వళ్ని యెక్కించను. మా పాపని యెక్కింతానంతే" అన్నాడు ముద్దులొలికే మాటలతో ఆ బాలుడు.

రామదాసు ప్రక్కనే కూర్చున్నతన భార్య రామే శ్వరిని చూపి "ఐతే మీ దొడ్డమ్మను తీసుకెళ్ళవేమిరా?" అన్నాడు.

"ఒద్దు- దొద్ద వొద్దు" అని నిష్కర్షగా సమాధానం చెప్పాడు. తమలపాకుల తొడిమెలు తీస్తున్న పెత్తల్లి మొఖంలోకే ఆ అబ్బాయి రెప్ప వాల్చకుండ చూస్తున్నాడు. ఆమె కోపంగా కనిపిస్తోం దతనికి.

"వొద్దులే నాయనా, నేనెందుకులే; రక్షించావు. మీ పెద్దబ్బనే రైలెక్కించి వూళ్ళన్నీ తిప్పు" అంది రామేశ్వరి నిర్లక్ష్యం స్పష్టమయ్యేటట్టు.

"దొడ్డని తీసికెళ్ళక పోవడమేమిరా? ఏమీ యెందు కొద్దూ?" అని రామదాసు అబ్బాయిని లాలిస్తూ అడిగితే అతడన్నాడు "దొడ్డేం.... నన్నాడించదు, నాకు అప్పచ్చిలు పెట్టదు." అని.

ఆమె వైఖరినిబట్టి తనను ఆదరించదని ఆ అబ్బాయి అభిప్రాయపడ్డట్టున్నాడు. "ఆడించి మిఠాయి పెడుతూంటే తీసుకెడతావా మరి?" అని రామదాసుఅడగ్గానే "ఓ తప్ప కుండా" అంటూ ఎగిరి గంతేశాడు. అల్లాగైనా రామేశ్వరి కోపం తగ్గుతుందని అతని ఆశ. అబ్బాయిని రామేశ్వరి దగ్గరగా జేర్చి 'నువ్వు బాగా ప్రేమిస్తే నిన్నూ తీసుకు వెడతా' నన్నాడు రామదాసు. 'మీరు వెడుదురూ చాలు, నేను రానక్కర్లేదుగానీ' అందామె పుల్లవిరుపుగా. కబుర్లు చెబుతూనే రామేశ్వరి వొడిలో కూర్చోబెట్టాడు రామదాసా అబ్బాయిని.

ఐతే రామేశ్వరి కుర్రవానిని విసిరి పారేసింది. ఆ తోపుతో వాడెడు దూరంగా పడ్డాడు. శరీరానికెక్కడా దెబ్బ తగలలేదు. రామదాసు అబ్బాయిని చేరదీసి బుజ్జగించి రైలు ఒవేళే తెచ్చిఇస్తానని మాటనిచ్చి తల్లి దగ్గరికి వెళ్ళమన్నాడు. పెదతల్లివైపు కోరచూపు చూస్తో తల్లి చల్లగా జారిపోయాడు నోరెరుగని బాలుడు.

భార్యవైపు తీక్షణంగాచూస్తూ రామదాసు "ఏమిటా వొళ్లుతెలియని కోపం; వాడో చెయ్యో విరిగితే?" అన్నాడు. అందుకామె "విరిగితేనే బాగుండేది— కాక పోతే యేమిటీ సంత మనకి?" అంది మూతిముడుచుకొని.

మాతృత్వమెరుగని ఆమె మనస్తత్వం యీ వాక్క ముక్కలోనూ రామదాసు గ్రహించగలిగాడు. అరికాలి మంట నెత్తికెక్కిం దాయనికి. తల ప్రాణం తోకకు దిగడం తప్ప ఆస్థితిలో అక్కడ యేమి చెప్పి యేమి లాభం? "తేనె చుక్కలవంటి పసిపాపల మాటలంటే అంతా చెవి కోసుకుంటారు. ఎంతటి కాఠిన్యమైన మన సైనా నవనీతంలాగ ద్రవిస్తుంది అట్టి పలుకులతో. నీ హృదయం పాషాణంకంటె దృఢమైనదనుకొంటాను. యిట్టి మనసు క్రూరమృగాలకైనా వుండదు" అని మాత్రం అనగలిగాడు.

"మాట్లాడితే వెటకారం చేయడంగాని, మీరుమరీ విడ్డూరమైన మనుషులు. ఎంత మొత్తుకున్నా చెవికెక్కదు. సప్తసాగరాలయాత్ర పోతారు. పూజా పునస్కారాలు, వ్రతాలు ఒకటేమిటి జరుగుబాటుంటేసరి పుత్రకామేష్టి క్రతువు కూడచేసికొనేవాళ్లుంటారు. అదేమి ప్రారబ్ధమో యేమో అతమ్ముడు. ఆమరదలే లోకం. వాళ్లపిల్లల్ని చూసి మురిసి పోతారు. వాళ్ల బిడ్డలు మనబిడ్డలెల్లా ఔతారండీ అమాయకత్వం కాకపోతేను?" అంది రామేశ్వరి తన పాత దుగ్ధను వెడలగ్రక్కుతూ.

రామదాసుకి ఆమె వైఖరి సుతరామూ నచ్చలేదు. "ఆ మొఖాలకి నోములు వ్రతాలు కూడాను. మూగ వాణ్ణి పలికించ వచ్చుగాని..." అని ఆయన అన బోయే సరికి రివ్వున వెళ్లిపోయిందామె సర్రున లేచి. బాలుడు వెళ్లినవైపుకే ఆయనా వెళ్లాడు యెంతో ఆదుర్దాగా.

అది జరిగిన కొన్నాళ్ళ వరకు రామేశ్వరి, రామదాసు మొదముఖం పెడముఖంగానే మసలుతూ వచ్చారు. పగలేదో వ్యాపకంలో తిరిగిరావడం, రాత్రి భోజనాల తర్వాత తమ్ముని బిడ్డలతో వుల్లాసంగా కాలక్షేపం చేయడం రామదాసుకి రివాజై పోయింది.

రామేశ్వరి మనోవ్యాకులత రోజు రోజుకీ యెక్కువౌతోంది. అది మరది కొడుకు మనోహరుని గెంటిపారవేసినందుకు కాదు. 'అమ్మా' అని పిలిపించుకొనే ఆశయిక జీవితంలో లేనే లేదా అని ఆమెవిచారము.

పట్టలేక ఒకరోజు రామదాసు యేటో చూస్తోన్నట్టు దృష్టిని మరొకవైపు మళ్ళించి చెంతనేవున్న రామేశ్వరికి వర్ణించేటట్టు "ఆవేళ మనోహరుని తోసిపారవేసి. వాని మనసును గాయపరచిన సంఘటన యీక్షణం వరకూ నన్ను కలవర పెడుతూనేవుంది."

రామేశ్వరి కూడ అదేపద్ధతిలో సమాధానంగా "నాలో ఆభావం ఏర్పడడానికి కారణంకూడ మీరే. మనిద్దరి జాతకాలు చూచిన దైవజ్ఞు డొకాయన మనకు సంతాన యోగ ముందని చెప్పారు. కాని దానికి కొంత ముందేదో ఆచరించా లని ఆయన సూచించారు. మీదారేదో మీదేగాని నాగోలేమీ మీకుపట్టను. జరుగవలసినది యెట్లావున్నా మనం ముందే ప్రయోజనంలే దనుకొని కూర్చోవడమేమిటి? చెప్పిందల్లా త్రోసిపారేస్తారు చులకనగా." అంది.

రామదాసుకి నవ్వొచ్చింది. కాని ఆపుకొన్నాడు. మంత్రాలకు చింతకాయలు రాలితే లోకంలో వ్యత్యాసాలు తారతమ్యాలు యెందుక్కావాలి? రోడ్లప్రక్కన పుస్తకాలు పరచుకొని, ఎముకలు, పుర్రెలు ప్రోగుచేసికొని జ్యోతిష్కులమని చెప్పుకొనేవారే సంతానాన్ని ప్రసాదిస్తే యికనేం? అన్నాడాయన.

సంతాన లేమికి లక్ష్యపెట్టని రామదాసు వైఖరి రామేశ్వరికొకవంక మండిపడ జేస్తుంది. కాని ఎందుకో కోపాన్ని అణచుకుంటోంది. చివరికి "మగవారికేం, గొడ్రాళ్ళని పడలేక ఆడవాళ్ళు చస్తే చూస్తూ వూరుకొంటారు." అందామె.

సాయంకాలపువేళ చల్లగాలినికని రామేశ్వరీ, తోటికోడలూ డాబామీద కబుర్లు చెప్పుకొంటూ కూర్చున్నారు. మనోహరూ, పాపా పరుగు పరుగున మెట్లెక్కుకుంటూ పైకివచ్చారు. అన్నా చెల్లెలు ముద్దు ముద్దు మాటలతో చిట్టి చిట్టి అడుగులు వేసికొని డాబామీద తిరుగుతూ ఆడుకొంటూ వుంటే యెంతో చూడముచ్చటగావుంది.

మధ్యలో మనోహరుకికోపము వచ్చినట్టుంది, కొట్టేందుకని చెల్లెల్ని తరుముకు వెళ్లాడు. పాపరివ్వున వెళ్ళి రామేశ్వరి ఒడిలో దూరింది. మనోహరుమాత్రం వూరుకొన్నాడా? వెనకాలేవెళ్ళి అతడూ పెత్తల్లి సందిట్లోకి చేరాడు

రామేశ్వరికి ఆబిడ్డలిద్దరూ వడిలోవున్నంతసేపు పాత ద్వేషం రోషం పటాపంచలై పోయాయి. వాళ్ళిద్దరూ తన కడుపున పుట్టినవాళ్ళవలె కొద్దిసేపు అదిమి పట్టుకొని ఆనందంగా గడిపింది. ఈదృశ్యాన్ని పరిశీలిస్తున్న తోటికోడలికి ఆపాపలతల్లి తానో, ఆమో సరిగాతోచలేదు. ఇంతలోకే క్రిందినుండి యెవరో కేకవేసినట్టయితేనూ మెట్లుదిగి లోనికి వెళ్ళిందామె.

ఆమెవెళ్ళింది. రామదాసు చేత్తోరైలుబండి పట్టుకొని పైకెక్కి వచ్చి 'యిదిగోరా రైలుబండి' అన్నాడు. ఆ మాటన్నాడో లేదో పిల్లలిద్దరూ చటాలున పెత్తల్లిపడిలో నుంచిలేచి పెద్దనాన్న దగ్గరికి పరుగెత్తుకు వచ్చారు. వాళ్ళని చేరదీసి రైలుబండిని వాళ్ళిద్దరికీ చూపించాడు.

కారణం స్పష్టపడలేదుకాని అది రామేశ్వరికి కన్నెర్రగా పరిణమించింది, అప్రయోజకత్వానికి ఆమె తనను తానే నిందించుకోసాగింది, రామదాసు రైలుబండి మనోహరుకిచ్చి రామేశ్వరి దగ్గరగా వెళ్ళాడు. "నీలోకూడ రావలసిన మార్పువచ్చిన ట్టుంది. కావలసిందికూడ అదే" అన్నాడాయన మెల్లగా.

ఈ మాటలు పుండుమీద కారం చల్లిన ట్లయింది. ఏమనాలో ఆమెకి స్ఫురించలేదు. కానిచేమీ అనలేదు.మనోవేదనను కన్నీటిద్వారా ప్రకటించింది. ఆరోజు కారోజు రామదాసు తమ్ముని బిడ్డలను యెంతగా ప్రేమించి ఆదరించడం అధికంచేస్తున్నాడో రామేశ్వరి అంతకు

మించి ద్వేషించ నారంభించింది. ఆమె పోకడ కక్ష పట్టినట్టుంది.

చల్లగాలి వీస్తోంది. రామేశ్వరి ఒంటరిగా డాబామీద కూర్చుంది. ఆమెకళ్ళు ప్రకృతి సౌందర్యంమీద వున్నాయి గాని మనసుమాత్రం నిశ్చలంగాలేదు. మనసులో చెలరేగిన తుఫానుని ఆమెముఖవాలకమే స్పష్ట పరుస్తోంది. ఏవేవో వూహలు, మరేవోచింతతో కూడుకొన్న ఆలోచనలు మనోవీధిని వడివడిగా ప్రయాణం చేస్తున్నాయి. గొడ్రాలు జీవితంపై ఆమెకుగల అసహ్యత ఒకప్రక్క, తోటికోడలి పిల్లల్నితన వారిగా తృప్తిపడి మగడు తనను లక్ష్యపెట్టక ఉన్నపరిస్థితి మరోప్రక్క వేధిస్తున్నాయి.

గగనవీధిని యెగురుతున్న గాలిపడగలలోఒక్కటైనా తెగి తమడాబామీద పడితే యెంతబాగుండును! రంగు రంగు పడగలు యెంతబాగున్నాయ్? ఏదైనాపడకపోతుందా అని మనోహరు కొంతసేపు చూచాడుగాని ఎప్పటికీ అతని కోరిక తీరలేదు,

వాళ్ళ పెద్దతల్లినడిగితే పనిజరక్కపోతుందా అని దగ్గరగావెళ్ళి 'దొడ్డా నాకోగాలిపడగ యివ్వవూ?' అన్నాడు రామేశ్వరి తడుముకోకుండ 'ఫో! అవతలకి వెళ్ళి పెద నాన్న నడుగు! తేకేంజేస్తారు?, అంది. మనోహరు అమాట లలోగల కటువుదనాన్నయితే గ్రహించలేదుగాని గాలి పడగను మాత్రం వాళ్ళపెద్దతల్లి యివ్వలేదని మాత్రం తెలిసి కొన్నాడు. అయితే అతని అభిలాష తీరక తిరిగి ఆమె దగ్గరగా వెళ్ళి జాలిగా "దొడ్డా నేనుకూడ గాలి పడగ యెగర వేసికోవొద్దూ!" అన్నాడు.

ఆమాటలు ఆమెహృదయాన్ని కొంచెం ద్రవింపజేసింది చూడముచ్చటైనముఖం, వినయింపుగావున్న మాటలు, సొంపైన నడవడిక. మనోహరుని యెత్తుకొని తనివితీర ముద్దాడాలన్నంత వుత్సాహం కలిగించాయి. అతనికి అమ్మ నైతే అంతకంటే భాగ్యం యింకేంకావాలి? అని అనుకో సాగింది. రామేశ్వరి మనోహరు తలపై చేయివేసి నిమర సాగింది. రెప్పవాల్చకుండా చూస్తూ అబ్బాయి '!గాలిపటం యివ్వకపోతేనా పెద్దబ్బతో చెప్పి తన్నింతా నంతే" అన్నాడు.

కాని చివరిమాటలు ఎంత అందంగా వున్నాయో అంత వాడిగా ఆమెహృదయాన్ని గ్రుచ్చుకున్నాయి. అంత లోకే ఆమెను క్రోధాగ్ని ఆవరించింది. కుర్రవానిని విసరి కొట్టింది. ఫో. వెళ్ళియెక్కడ కాలాలో అక్కడ చెప్పుకో మీపెద్దబ్బయినా, ముత్తాతైనా నన్నేం జేస్తారోజూస్తాను." అందామె.

పెత్తల్లి కేకలు మనోహరుని నఖశిఖ పర్యంతమూ కంపింప చేశాయి. ముఖం యెర్రబారింది. కంటికి కడివెడు నీళ్లు కారసాగాయి. దిగాలు పడిపోయాడు. ఏంజేస్తాడు పాపం! నాఅన్నవాళ్ళు ఎవరూ దగ్గర లేరు. అప్పటికీ ఆశతీరక ఆకాశంలోకి చూస్తూన్నాడు గాలిపడగల కోసం.

దీనికంతకీ కారణం తనభర్త అసమర్థత, మెత్తదనమే నని రామేశ్వరి స్థిరసంకల్పము. కాకుంటె చూడు చెప్పి తన్నిస్తానని ఐదేళ్ళ కుర్రకుంక దగ్గరనుంచీ ఝడిపించే వాళ్లే. దేనికైనా హద్దూపద్దూ వుండాలి. రోశని యెప్పుడు వికగడౌతుందో గాని అదిజరిగితే పండగ చేసుకోవూ ఆరోజు.

ఎగురుతున్న గాలిపటాల్లో ఒకటి టప్పునతెగి గాలిలో యెగిరి వస్తోంది. పిట్టగోడకు ఆవలగా వీధిగుమ్మానికి పైభాగాన్ని ఆర్చిలో వాలసాగింది. డాబాచుట్టూ పిట్టగోడ వుంది. రామేశ్వరి నిలబడి వున్న చోటనే పిట్టగోడకు గుమ్మంలోగా కాళీ వుంచబడింది. ఆకాళీఆర్చికి తిన్నగానే వుంది కూడా.

గాలిపడగ నందుకొందామని ఆదుర్దాగా మనోహర్ పరుగెత్తాడు. ఆర్చిమీద వాలే గాలిపడగను కాళీలో తన పెత్తల్లిని కాళ్ళసందునుంచి చూస్తున్నాడు, యింతకీగాలి పడగ మాత్రం వాకిట్లో నేలమీదే పడింది. మెడపంచి గాలిపటం తమవాకిట్లో వాలుతున్నదని కాలుముందరకు వేసి పరికిస్తున్నాడు. పరమసంతోషంతో.

వీధిలోకి పరుగెత్తాలని గిరుక తిరగబోయాడు మెట్ల వైపున ముఖంపెట్టుకొని. కాలు సర్రున జారింది. మనో హరుకూడ గుండెలవరకు దిగజారి పోయాడు. రెండు చేతులతో పిట్టగోడ కాళీలు పట్టుకొంటూ క్రిందికి పడి పోతున్నానని వెర్రికేకలు 'దొడ్డా పట్టుకో దొడ్డా పడి పోతున్నా' అంటూవేశాడు. రామేశ్వరి కన్నెత్తిచూడలేదు ఆక్షణంకోసమే నిరీక్షించుకొని వున్నట్టు. పైపెచ్చు'చావనీ పడి చస్తేనేమంచి'దనుకొంది.

మనోహరుని జీవన్మరణస్థితిని రామేశ్వరి చివరికి గుర్తించింది. చేయిజారిన తర్వాత యేమనుకొని ఏమి

లాభం లేదనుకొంది. గర్భశోకం యెవరికైనా ఒకపేనను కుంది. మనోహరుడు మరణించడంవల్ల తనకు ఒరిగే దేమీలేదని తెలిసికొన గలిగింది. మనోహరు చేయికోసం తనచేయి చాచింది. ఐతే మనోహరు చేతిలోవున్న పిట్ట గోడ యిటుకపట్టు పూడిపోయింది. ఇంకేముంది? అనుకొన్నదంతా అయింది. నోరెరుగనిబాలుడు మృత్యువు కౌగిట్లో బిగింపబడ్డాడు. వానితోబాటు రామేశ్వరికూడ లప్పిమీదికి పడిపోయింది.

పదిహేను రోజులవరకూ రామేశ్వరి స్పృహలోలేదు. నూటైదు డిగ్రీలవరకూ జ్వరం. ఆస్థితిలోనే తరచూ "చూడు చూడు....పాపం పట్టుకో పట్టుకో పడిపోతు న్నాడు.... చేతులారానా.... చూస్తూనేనా" అంటోంది ఆమె. హఠాత్తుగా లేవబోతుంది మనోహరుని రక్షించండి బాబో అని కెవ్వుమనసాగింది. "నిన్ను కాపాడలేక పోయానురా నాయనా నేనుచూస్తూ వూరుకోకపోతేనా" అంటోంది.

మనోహరుని విరిగిన కాలుకి కట్టిన సిమెంటు కట్టు విప్పారు. ఎముక అతుక్కొంటూన్నట్టు డాక్టరుగారు చెప్పారు. మరోపదిరోజులకి రామేశ్వరి జ్వరమూతగ్గింది. రామేశ్వరి చెమ్మగిల్లినకళ్ళతో 'నామనోహర్ యేడి' అంది ప్రక్కనేవున్న రామదాసు "కులాసాగా వున్నాడు, కాలు అతుక్కొంది. యిదుగో:" నని మరో ప్రక్కమీద వున్న మనోహరుని రామేశ్వరికి అందించాడు తనకళ్ళుకూడ చెమ్మగిల్లు తూండగా.

రామేశ్వరికూడ మనోహరుని హృదయానికి హత్తుకొని ముద్దు పెట్టుకొంది. పాపను రెండోచేత్తో దగ్గరగా తీసికొంది. ఆమె తోటి కోడలు చిరునవ్వు నవ్వింది. మరదీ మురిసిపోయాడు. ఏమండీ! వీళ్ళిద్దరికి చెరోరైలు పట్టుకొచ్చి యివ్వండి. మనల్ని యెక్కిస్తారుకదూ!" అందామె అమాయకత్వంగా.

